

# కథా కౌముది

## ఆత్మఘోష

డా.తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ఇవాళ ఎందుకో అంతా సందడి గా ఉంది. అద్దె కున్న వాళ్ళు నిన్ననే సామాను మొత్తం తీసుకుని వెళ్ళి పోయారు. ఇదివరకు మూడు లేదా నాలుగు ఏళ్లు ఉండి పోయిన వాళ్ళలాగానే వీళ్ళు కూడా కనీసం వెనక్కి తిరిగి చూడకండా పోయారు. అంతే వాళ్ళకు నాతో అనుబంధం . .

ఎవరో పని వాళ్ళు వచ్చారు. నిచ్చెన వేసుకుని పైకి ఎక్కి అటక మీద ఎన్నో ఏళ్లు గా వున్న వస్తువులు దింపుతున్నారు. నేను ఒంటరిగా ఉన్నాను.

అటక మీద నుండి దింపిన వాటిలో పాత కాలం నాటి నలుపు తెలుపులో వున్న రెండు ఫోటోలు చూడగానే ఎంతో కాలం క్రిందట పోగొట్టు కున్న ప్రియ మిత్రులను చూసినట్టు నా మనసు ఉప్పొంగింది. మంచి ఒడ్డు పొడుగు ఉండి స్పురద్రూపి అయిన ఆ ముసలి ఆయనకు నేనంటే చాలా ఇష్టం. ఆయన సాహచర్యం లో నేను నవ యవ్వనం లోని ఆనందాన్ని అనుభవించాను.

ఆయన సుఖాన్నీ, దుఖాన్ని నేను పంచుకున్నాను. ఆయన తన ప్రాణానికి ప్రాణ మైన సహచరిని పోగొట్టుకున్న బాధలో నిద్ర రాక అర్ధరాత్రి సిగరెట్ వెలిగించుకుని పచార్లు చేస్తూ , మనసులో రేగే జ్ఞాపకాల సుడి గాలిలో అసహాయం గా కొట్టుకు పోవడం చూసి నా హృదయం కరిగి పోయేది . .

ఆయనకు నేనంటే ఎంత ప్రేమో ఇంటి ముందు ఉన్న రెండు కొబ్బరి చెట్లు అన్నా అంతే ఇష్టం. స్నానం చేయాలంటే లోపలి నుండి బకెట్ లో నీళ్ళు మోసుకు వచ్చి ఆ చెట్టు మొదలు వద్ద బల్ల మీద కూర్చుని నీళ్ళు పోసుకునేవాడు. చెట్లకు క్రమం తప్పకుండా నీళ్ళు అందేవి.

పదవిలో వున్నప్పుడు దర్జాగా జీపులో తిరిగిన వాడు పదవీ విరమణ తరువాత సైకిల్ తొక్కడం మొదలు పెట్టాడు.

ప్రతీ శుక్రవారం రెండు మైళ్ళ దూరం పాత వూళ్ళో సంతకు సైకిల్ మీద వెళ్ళి కూరగాయలు కొని, ఆ బరువు సంచీలు సైకిల్ కు తగిలించుకుని ఆయాస పడుతూ తొక్కుతూ వస్తాడు.

ఇంటికి రాగానే " అమ్మా! లేత వంకాయలు తెచ్చాను! పొడి చల్లి కూర చెయ్యమ్మా !" అని కూతురుకు చెప్తాడు.

మేజిస్ట్రేటు గా పని చేసే రోజుల్లో రోజుకు ఒక గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ పేకెట్ తాగేవాడు కాస్తా ఇప్పుడు రోజుకు రెండు బర్కిలీ సిగరెట్లు కొనుక్కోవడం మొదలు పెట్టాడు..

రిటైర్ అయినాక , తన అర్ధ శరీరం తనను వదిలి పోయాక ఆయనతో నా స్నేహం మొదలయింది.

ఈ పొదుపు, జాగ్రత్త ఎందుకు అంటే అదిగో ఆ రెండో ఫోటోలో వున్న అయిదుగురు పిల్లలను పెంచి పైకి తీసుకు రావడానికి.

యాభై అయిదేళ్ళ వయసులో భార్య పోయిన మగవాడు ఎవడైనా ఆరు నెలలు తిరక్కుండానే మళ్లీ పెళ్లి చేసుకుంటాడు. అందులోనూ అందగత్తె ఆస్థిమంతురాలు అయిన ఒంటరి ఆడది సిద్ధంగా ఉన్నా మనసు చెదరని ధీమంతుడు ఆయన.

ఆయనకు నాతో పరిచయం కాక ముందే పెద్ద కూతురికి పెళ్లి చేసి పంపేసాడు. నేను చూస్తుండగానే రెండో పిల్లకు వివాహం జరిపించేసాడు.

ఇక మూడో కూతురు చదువుతాను అంటూ పట్టు బట్టింది . చదువు అయ్యింది. ఉద్యోగము వచ్చింది.అదిగో ఆ మేడ మీది గదిఆ పిల్ల వాడుకుంటుంది. ఆయన పడక ఏమో మేడ మీది వరడాలో.

రాత్రి వేళ డాబా మీద ఒంటరిగా పడుకుని నక్షత్రాలను చూస్తూ తనని వదలి పోయిన తల్లిని తలచుకుని కుమిలి పోతూ కన్నీరు పెట్టుకునే మూడో కూతుర్ని వెదుకుతూ వెళ్ళి తల నిమిరి ఓదార్చే వాడు ఆయన

బయట ఏదో గోలగోల గా ఉంది . లారీ ఒకటి వచ్చి ఇంటి ముందు ఆగింది. ఈ సామానులు ఎక్కిస్తారేమో! వెనకాలే పెద్ద కారు కూడా వచ్చింది.

" ఆ దిగే వాళ్ళు ఎవరబ్బా? ముప్పై లలో వుంది ఆ ఇద్దరి వయసు. అన్నా చెల్లెళ్ళు ఏమో ! అరే ఆ కుర్రవాడు అచ్చంగా ఫొటో లోని ముసలాయన లాగానే వున్నాడు. ఆ అమ్మాయి ఏమో ఆయన అర్ధాంగి లా ఉంది. నిజంగా ఈ పోలికలు తర తరాలకు ఎలా వస్తాయో! "

వాళ్ళను చూస్తుంటే నా మనసు ముప్పై అయిదేళ్ళ క్రిందటి కి వెళ్లిపోయింది. నా పూర్వ వైభవం నాకు మళ్లీ వస్తుందా!

నా పొరుగు మిత్రుడి బాస్ వీళ్ళిద్దరితో ఏదో మాట్లాడు తున్నాడు. ఆయనతో వీళ్ళకి ఎందుకు పని? అసలే అతను గుండె లేని మనిషి అని విన్నాను. ఆయన కంటికి ఇల్లు అంటే నాలుగు గోడలు , ఇటుకలు సెమెంటు అట. పక్కా డబ్బు మనిషి .

ఇక్కడ వీళ్ళు అటక మీద నుంచి రోజ్ ఉడ్ మందాసనము దింపారు. ఆ ఇల్లాలు వెళ్ళి పోయినా ఆ మందాసనం నిండా వుండే దేవుళ్ళకు ఆమె మూడో కూతురు రోజూ దీపం పెట్టి పూజ చేసేది .

అమ్మ ఎక్కడ నొచ్చుకుంటుందో అన్నట్టు ప్రతి పండగ అమ్మ జరిపి నట్టే జరిపేది. సంక్రాంతికి ఇంటి ముందు ముగ్గులు వేసి చక్కెర పొంగలి చేసి దేవుడికి నైవేద్యం పెట్టేది. ఉగాది కి వేప పువ్వు పచ్చడి , పూర్ణం పోలీలు తప్పదు. దీపావళి కి కారప్పూస, రవ లడ్డు , ఇంటి ముందు ప్రమిదలలో దీపాలు వుండాల్సిందే. ఏ పండగ అయినా దేవుడి మందాసనము మామిడి ఆకులతో , మందార పూలతో కళకళ లాడాల్సిందే. ఇక కృష్ణాష్టమి వస్తే వీధి గుమ్మం నుండి దేవుడి గది దాకా కృష్ణ పాద ముద్రలు ముగ్గు వుండాల్సిందే. బాల కృష్ణుడికి పాలు ,వెన్న, అటుకులే కాకుండా చెగోడీలు, పాలకాయలు,వెన్న అప్పాలు వంటివి నైవేద్యానికి తప్పక చేసేది. బయట నిలబడిన ముసలాయన మనవడు మనవరాలు లోపలికి వస్తారేమో అని చూస్తూ వున్నా. అబ్బే నా పొరుగు మిత్రుడి బాస్ కి ఏవో కాగితాలు అందిస్తున్నారు.

"వాళ్ళు వచ్చింది ఎందుకు? తాతగారు నడిచిన నేల మీద నడిచి ఆ స్పర్శ అనుభవించడానికి కాదూ ? వాళ్ళ అమ్మలు తమ కౌమారాన్ని, యవ్వనాన్ని గడిపిన పరిసరాలలో ఆ పరిమళం పీల్చడానికే కదా ! వస్తారులే. "

ఆ ఫోటోలు మాత్రం కారు డిక్కీ లో పెట్టించారు. ఫరవాలేదు. మందాసనము లారీ లోకి ఎక్కించేశారు. ఫోటోలకు ఉన్న అద్దాలు పగిలి పోకుండా జాగ్రత్త గా పెట్టారో లేదో ఈ పిల్లలు చూడరే?

ఈ సారి అటక మీద నుండి హోమియోపతి మందులు పెట్టుకునే డబ్బాలు పెట్టే చిన్న చెక్క బీరువా దింపారు. మా సారు హోమియోపతీ ఔపోశన పట్టారులే .

"నాన్నా! కాలిలో గుచ్చుకున్న ముల్లు రావడం లేదు అని కొడుకు అనడం తడవు " శైలీషియా ముప్పై ఒక దోసు వేసుకోరా దెబ్బకు బయటకు రావాల్సిందే. " అంటాడు.

ముక్కులో నీళ్ళు కారుతోందాఅలియం సీపా , గొంతులో నొప్పిగా వుందా ? హెపార్ సల్ఫ్, ఎడమ వైపు బాధనా? లాకేసిస్ ఉందిగా .పంటి నొప్పయితే ప్లాంటాగో రెండు వందలు పోటెన్సీ పడాలి ." ఈ మందుల పేర్లు ఆయన పిల్లలకే కాదు ఇంట్లోని గోడలకు, గుంజలకూ కంఠస్తమ్ వచ్చేశాయి. ఆ హోమియోపతి బీరువా ఇప్పుడు ఏం చేస్తారో!

బయట ఈ గలాభా ఏంటో... అరె ప్రొక్లైనర్ వచ్చింది . ఆ వెనకాల పదిమంది కూలీలు కూడా దిగారు . ఎందుకో? ముసలాయన వున్నప్పుడు నన్ను ఎంత జాగ్రత్తగా చూసుకునేవాడు! వేరే వాళ్ళకు ఒప్పగించి వెళ్లే రోజు ఆయన హృదయ వేదన చూడలేక నాకూ కనబడని కన్నీళ్ళు వచ్చాయి.

ఆ తరువాత నా మూతి పగిలినా, ముక్కు సొట్ట పోయినా, రంగు మాసినా పట్టించుకునే వాడు ఎవడు? వాళ్ళ అవసరం కోసం కొన్నేళ్ళు ఉండి

, వెళ్ళి పోయే వాళ్ళు . నా బాగోగులు గురించి ఎవరికీ పట్టలేదు.

మళ్లీ నాకు మంచి రోజులు వస్తున్నాయా? అందుకేనా ఈ పిల్లలు వచ్చింది? కళ్ల వాకిళ్ళ లోనుండి, గవాక్షాల నుండీ తొంగి చూస్తున్నా బయటకు .

లోపలికి వచ్చిన పనివాళ్ళు అటక మీది నుండి విరిగి పోయిన వీణదింపారు. ఈ వీణ మీదే ఆయన పెద్ద కూతురు సరిగమలు నేర్చుకుంది . వీణ మీద దంతంతో చేసిన నగిషీ పని చేసి వుంది. మాస్టరు గారికి ఒక వీణ, అమ్మాయికి ఒక వీణ– ఎదురు వీణ తో నేర్చుకున్నది. పెళ్లి అయ్యాక అత్తారింటికి వెళ్ళేటప్పుడు సారెలో వీణ కూడా వెళ్ళింది. అపర సరస్వతిలా వీణ వాయించేది. రెండు నెలలకు ఒకసారి తండ్రిని చూడడానికి వచ్చేది. అమ్మ పోయాక మిగతా పిల్లలను తానే తల్లిలా చేరదీసింది. ఆయనకు ఇష్టమయినవి వండి పెట్టడం, చెల్లెళ్లకు మంచి చెడు వివరించడం . రాత్రి తొమ్మిది గంటలకు నాన్న. ముందు కూర్చుని వీణ పట్టుకుంటే పదకొండు దాకా వాయించేది.

త్యాగరాజుపంచరత్న కీర్తనలలో ఒకటి అయిన " జగదానంద కారకా జయ జానకీ ప్రాణ నాయకా ను నాట రాగం ఆది తాళం లో పలికించినా, " సీతమ్మ మా యమ్మ, శ్రీ రాముడు మా తండ్రి" అని వసంత రాగం లో వాయించినా గుండె పులకించి పోవలసిందే .చుట్టూ వున్న తలుపులు ,కిటికీలు , నేల ,పైకప్పు కూడా రాగ రసానందం లో ఓల లాడ వలసిందే. ఇక్కడ ఉన్న చరాచరములు అన్నిటికీ సంగీత గంధం అంటుకుంది .

ఆఖరుగా పైనుండి ఏవో పాత పుస్తకాలు వున్న అట్ట పెట్టె , బొమ్మలున్న పేము బుట్ట దిగాయి. ఏవో హోమియోపతి పుస్తకాలతో బాటు ఒక తెల్ల కాగితాల పుస్తకం ...... తెల్ల కాగితాల పుస్తకం ఆల్బంగా రూపు మార్చుకున్నది. అది ముసలాయన ఒక్కగానొక్క కొడుకు తన ప్రియమైన సినిమా తార హేమమాలిని ఫోటోలు ఎక్కడెక్కడి నుండో సేకరించి అంటించుకున్న పుస్తకం.

ఒక్కడే కొడుకు అని వాడిని కొంచెం ఎక్కువ క్రమ శిక్షణ లో పెట్టడానికి ప్రయతించాడు పెద్దాయన.

పద్దెనిమిది ఏళ్లు వచ్చేసరికి తండ్రికి చెప్పకండా సిగరెట్ కాల్చడం, సినిమాలకు పోవడం మొదలు పెట్టాడు.

తండ్రిని ఎదిరించి మాట్లాడటం మొదలయ్యింది. ఆ ఫొటో తీసిన రోజు అలా పోట్లాడి విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. అందుకే ఆ ఫోటోలో అయిదుగురు అక్కా చెల్లెళ్ళు మాత్రమే ఉన్నారు .

బయట టంగుటంగు మంటూ ఏవో శబ్దాలు వినబడు తున్నాయి. ఆ కూలీలు ఏమిటి గునపాలు ,పారలు పట్టుకుని ఇటువైపుకు వస్తున్నారు?

అయ్యో ఆ బొమ్మల పెట్టె భద్రంగా లారీ ఎక్కించండి. ఈ ఆడపిల్లలు ఎంతో ముచ్చటగా దసరాకు బొమ్మల కొలువు లో పెట్టుకునే చిలకలు, ద్రాక్ష గుత్తులు, తాజ్‌మహల్ , బుద్ధుడు, లక్ష్మీ దేవి, విష్ణుమూర్తి , రాధాకృష్ణులు, కొడపల్లి బొమ్మలు, సీతారామలక్ష్మణ ఆంజనేయులు,ఎన్నో బొమ్మలు వున్నాయి. బొమ్మల కాలు విరిగినా, సొట్ట బోయినా అపురూపం గా దాచుకునే వాళ్లే గానీ పారేయడం తెలియదు. ఇప్పటిలా ఈ రోజు మోజుపడి కొన్న వస్తువు రేపు బజారులో కొత్త మోడల్ వస్తే పాతది పారేసి కొత్తది కొనడం ఎరుగని రోజులు అవి.

ఆడపిల్లలను ఎలా జీవితం లో స్థిరపరచ గలనో అని ఆయన బెంగ పెట్టుకున్నాడు గానీ మూడో పిల్లకి పెళ్లి కుదిరే సరికి నాలుగో కూతురికి వరుడు తానే వెదుక్కుంటూ వచ్చాడు. ఆఖరి కూతురు గురించి ఎక్కువ దిగులు పెట్టుకున్నాడు ఆయన. రాత్రి వేళ అందరు పడుకున్నాక తాను రాసుకున్న జాతకాల పుస్తకం పట్టుకు కూర్చునే వాడు. ఆ పిల్ల జాతకం లో సప్తమ స్థానం లో కుజుడు ,శని ప్రభావం ఉందని, వివాహం అయినా విఛ్చిన్న మయి పోతుందని పదే పదే పైకే అనుకునేవాడు. అందుకే ఆ అమ్మాయిని తన తలకు మించిన భారం అయినా మెడిసిన్ లో చేర్పించాడు. తన కాళ్ళ మీద తాను నిలబడుతుందన్న ఆశతో.

పేము పెట్టె లారీ లోకి చేరింది. " పాత సామాను కొనే అంగడి కి వేసేయండిరా" అని లారీ డ్రైవరుకు కు క్లీనరుకు చెప్పాడు పెద్దాయన మనవడు.

' ఇదేం ఘోరం ' అనుకునే లోగా పెద్ద ధూళి గాలిలోకి లేచింది. కూలీల గునపాలు ప్రహరీ గోడమీద దాడి చేస్తున్నాయి. గోడలు కూలి పోతున్నాయి.

"నాయనా, తల్లీ ! మీరేమిటి అలా పట్టనట్టు నిలబడ్డారు? ఇది మీ తాత ఎంతో ప్రేమగా కట్టుకున్న ఇల్లు! అయ్యో మీరిద్దరు కారెక్కి వెళ్ళి

పోతున్నారేమిటి? నేనంటే నాలుగు గోడలుకాదు ఇటుకలు, సిమెంటు, ఇసుక మాత్రమే కాదు. పదేళ్ళ సహవాసం మాది.

నా పొరుగు మిత్రుడి బాస్ పక్కనున్న కాంట్రాక్టరూ తో ఏదో అంటున్నాడు. " పక్కనే వున్న మా ఇంటి సైటు పన్నెండు సెంట్లు, ఇదొక పన్నెండు సెంట్లు. ఇరవై నాలుగు సెంట్ల స్థలం లో అయిదు అంతస్థులతో ఇరవై ఫ్లాట్ లు కట్ట వచ్చు. అంటే ఎనిమిది కోట్లు. ఈ కొబ్బరి చెట్లకు చోటు దండగ . కొట్టించేయి . "

పెద్ద శబ్దం తో ప్రొక్లైనర్ పని చేయడం మొదలయ్యింది. రాక్షసి లాటి మూతి తో రాళ్లు, మట్టి ఎత్తి పోస్తోంది.

" ముందు సింహ ద్వారం పని చూడండిరా " కొత్త యజమాని ఆజ్ఞ ఇచ్చాడు . కూలిన ప్రహరీ గోడలు దాటి లోపలికి వచ్చారు కూలీలు. ఒకే సారి నాలుగు గునపాలు నా గుండెను తాకాయి.

ఇంటి నంబరు 3/22 అని రాసి వున్న పలక టంగున చప్పుడు చేస్తూ క్రింద పడింది. “అయ్యో అదే నా గుర్తింపు , నా ఉనికి, నా అస్తిత్వం.” నా ఆత్మ ఘోషించింది .

మమకారాలు ,బంధాలు, అనుబంధాలు వేటికీ విలువ ఇవ్వని నేటి తరం ప్రతినిధులు వాళ్ళు. ఈ ఇంటితో పెన వేసుకున్న ఆ ముసలాయన అనుబంధం, ఆయన కష్ట సుఖాలే నావిగా చేసుకున్న నా ఆత్మీయత వాళ్ళ కళ్లకు బుద్ధిహీనతగా కనిపించ వచ్చు.

మరోసారి గునపాలు పైకిలేచి నా గుండెను తాకాయి . నా ఆత్మ ఘోష ఎవరికి వినబడుతుంది ?

★★★

Click here to share your comments on this story